తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 17 - జనవరి 2026 | సంపుటి:3 | సంచిక:229 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డికి

## ఘన నివాళులు

- స్మూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి పుష్పాంజలి
- ప్రజాసేవకు అంకితమైన జీవితం స్మరణ
- పాల్గొన్న నేతలు, కుటుంబ సభ్యులు

2లో

హతిఘాట్‌లో

# చనాక – కొరాటా బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభం

## లోయర్ పెనుగంగ ప్రధాన కాలువకు నీటి విడుదల

సాగునీటికి కొత్త ఊపిరి..

రైతుల జీవితాల్లో మార్పుకు బాట... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఆదిలాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదిలాబాద్ జిల్లా భోరాజ్ మండలం హతిఘాట్ గ్రామంలో చనాక - కొరాటా బ్యారేజ్ పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమం ఉత్తర తెలంగాణ ప్రాంత సాగునీటి అవసరాలకు కీలక మైలురాయిగా నిలిచింది.

బ్యారేజ్ ద్వారా పెనుగంగ నది జలాలను సమర్థవంతంగా వినియోగించుకొని సాగునీటి విస్తీర్ణాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

మిగతా 2లో..



## కేసీఆర్ హయాంలోనే 90% పూర్తైన ప్రాజెక్టుల ప్రారంభం సంతోషకరం –మాజీ మంత్రికేటీఆర్

- చనాక–కొరాట బరాజ్‌తో ఆదిలాబాద్ ప్రాంతానికి సాగునీటి భరోసా
- సదర్‌మాట్ బరాజ్ ద్వారా నిర్మల్, జగిత్యాల ఆయకట్టుకు లబ్ధి
- తెలంగాణ దశాబ్దిలో సాగునీటి విప్లవం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రారంభమై, తొంభై శాతం పైగా పనులు పూర్తిచేసుకున్న రెండు కీలక ఇరిగేషన్ ప్రాజెక్టులు నేడు ప్రారంభం కావడం సంతోషకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..



## మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శ

- సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నారాయణ్ రెడ్డి ఆరోగ్యంపై ఆరా
- వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన రాజనర్సింహ

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

సంగారెడ్డి జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జ్ సిద్ధం రెడ్డి నారాయణ్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు. పార్టీకి, ప్రజాసేవకు దీర్ఘకాలంగా సేవలందించిన నాయకుడి ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపించారు.

మిగతా 2లో..

ఆదిలాబాద్ అభివృద్ధికి సమాన ప్రాధాన్యం

తుమ్మిడిహట్టి ప్రాజెక్టుతో రైతాంగానికి నీటి భరోసా

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో మార్పు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# నిర్మల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రజా సభ



**నిర్మల్, (తెలంగాణ ముచ్చట్లు):**

నిర్మల్ జిల్లాలో నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అనంతరం నిర్మల్ ప్రజా సభలో పాల్గొని ప్రజలతో తన ఆలోచనలు పంచుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# పెనుగంచిప్రోలు అమ్మవారిని దర్శించిన ఉప ముఖ్యమంత్రి

- ప్రత్యేక పూజలు నిర్వహించిన భట్టి విక్రమార్క
- రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు
- రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష

**పెనుగంచిప్రోలు, (తెలంగాణ ముచ్చట్లు):**

పెనుగంచిప్రోలులోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దర్శించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ఉప ముఖ్యమంత్రి ప్రార్థనలు చేశారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, కుటుంబాల్లో శాంతి, సమృద్ధి వెల్లివిరియాలని కోరుకున్నారు. ప్రజల నమ్మకాలకు ప్రతీకగా నిలిచిన పెనుగంచిప్రోలు అమ్మవారి క్షేత్రం ఆధ్యాత్మిక శక్తికి నిలువెత్తు సాక్ష్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో..





## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- స్పీకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం
- ఇదే చివరి అవకాశం అంటూ స్పష్టీకరణ
- రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

2లో



## హైదరాబాద్ మెట్రో రెండో దశపై వేగం అవసరం

- ముఖ్యమంత్రికి లేఖ రాసిన కేంద్ర మంత్రి
- సంయుక్త కమిటీకి అధికారులు వెంటనే నామినేట్ చేయాలని విజ్ఞప్తి
- నగర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా సూచనలు

2లో



## "తెలంగాణ ముచ్చట్లు" దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఖమ్మం,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముచ్చట్లు తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికలు వారధిగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి జర్నలిస్టులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. నిజానిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడం జర్నలిస్టుల ప్రధాన బాధ్యత అని అన్నారు. సమాజంలో మార్పుకు నాంది పలికే శక్తి జర్నలిజంలోనే ఉందని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డికి ఘన నివాళులు

**హైదరాబాద్,**

కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ పీవీ మార్గ్‌లోని నెక్లెస్ రోడ్ వద్ద ఉన్న వారి స్మారక స్థలం స్ఫూర్తి స్థల్‌కు చేరుకుని పుష్పాంజలి ఘటించారు. ప్రజాస్వామ్య విలువలకు, సామాజిక న్యాయానికి అంకితమైన నాయకుడిగా జైపాల్ రెడ్డి సేవలను ఈ సందర్భంగా స్మరించారు.

స్ఫూర్తి స్థల్ వద్ద నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి జైపాల్ రెడ్డి రాజకీయ జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. దేశ రాజకీయాల్లో స్పష్టమైన అభిప్రాయాలు, సిద్ధాంతపరమైన నిబద్ధత, ప్రజా సమస్యలపై ధైర్యంగా నిలిచే స్వభావం ఆయనను విశిష్ట నాయకుడిగా నిలిపిందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన కాలంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశాభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొని పుష్పాంజలి ఘటించారు. అలాగే ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ఈ నివాళుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు నివాళులు అర్పించారు. ప్రజల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా, విలువల రాజకీయాలకు ప్రతీకగా జైపాల్ రెడ్డి స్మృతి తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు నాయకులు పేర్కొన్నారు.






# హతిఘాట్‌లో చనాక – కొరాటా బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని, తద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నాగేష్, ఖానాపూర్ శాసనసభ్యుడు పాయల్ శంకర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతం సాగునీటితో పాటు త్రాగునీటి సమస్యల నుంచి కూడా క్రమంగా విముక్తి పొందుతుందని అధికారులు తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన ధర్మాసనం, ఈ అంశంపై ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని స్పష్టం చేసింది. ఇక ఇదే చివరి అవకాశమని, మరింత ఆలస్యం సహించబోమని హెచ్చరించింది.

మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత అంశంపై రెండు వారాల్లోగా స్పీకర్ తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిర్ణయం తీసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టంగా పేర్కొంది. అవసరమైతే తామే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

అనర్హత అంశంపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలతో రెండు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫిరాయింపులపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి విషయాలను నిర్లక్ష్యం చేయలేమని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఈ కేసు విచారణను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. తదుపరి విచారణలో స్పీకర్ తీసుకున్న నిర్ణయం, సమర్పించే అఫిడవిట్ ఆధారంగా తదుపరి చర్యలు నిర్ణయిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.

## "తెలంగాణ ముచ్చట్లు" దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతీయ సమస్యలు, ప్రజల దైనందిన జీవన సమస్యలను ప్రతిబింబిస్తూ ముందుకు సాగుతున్న తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ప్రస్థానాన్ని మంత్రి అభినందించారు. ప్రజలకు చేరువగా ఉండే వార్తలతో పాటు సామాజిక బాధ్యతను మరిచిపోకుండా పనిచేయడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా పత్రిక మరింత విస్తృతంగా అభివృద్ధి చెందాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక యాజమాన్యానికి, సంపాదక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఇన్చార్జి కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ, ఖమ్మం బ్యూరో మదర్ సాహెబ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో అభివృద్ధి శంకుస్థాపనలు, ప్రజాసభ

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలనలో ఈ జిల్లాకు రావాల్సినంత అభివృద్ధి జరగలేదని, ఇప్పుడు పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని చెప్పారు. ఆదిలాబాద్‌కు మంజూరైన యూనివర్సిటీని బాసరలో ఏర్పాటు చేయాలని తాను కోరుకుంటున్నానని వెల్లడించారు. ఆదిలాబాద్ రైతాంగానికి సాగునీరు అందించాలంటే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం తప్పనిసరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ చుక్క నీటిని ఒడిసిపట్టుకుని ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ద్వారా జిల్లాలో వ్యవసాయ రంగానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా ఆదిలాబాద్‌లో విమానాశ్రయంతో పాటు అతి పెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం, ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలవడానికి తాను వెనకాడనని, అయితే వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎవరినీ కలవనని స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన అప్పులు రాష్ట్ర ప్రజలపై భారంగా మారాయని, అయినా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానిని ఎన్నిసార్లైనా కలుస్తానని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి వివరించారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని, ఆడబిడ్డల సంక్షేమం కోసం రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. పేదల ఇళ్లలో గృహజ్యోతి వెలిగిస్తూ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ఇవన్నీ తమ సంక్షేమ పథకాలలో కొన్ని మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు మంచి చేసే వారిని, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే వారినే గెలిపించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో గెలిచామని, రాబోయే ఎన్నికల్లో కూడా గెలిచి రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పెనుగంచిప్రోలు అమ్మవారిని దర్శించిన ఉప ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా రైతుల సంక్షేమం కోసం ప్రార్థించిన భట్టి విక్రమార్క, రైతన్నలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సాగునీరు, మౌలిక సదుపాయాలతో గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలని, రైతుల కష్టాలు తీరాలని మన స్ఫూర్తిగా కోరుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకుంటూనే సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శ

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నారాయణ్ రెడ్డిని కలిసి ఆయన ఆరోగ్య స్థితిగతులపై సవివరంగా మాట్లాడిన మంత్రి, అక్కడి వైద్యులను కూడా సంప్రదించి చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందిస్తున్న వైద్య సేవలు, కోలుకునే ప్రక్రియ, తదుపరి చికిత్స చర్యలపై పూర్తి సమాచారం సేకరించారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా నారాయణ్ రెడ్డి కుమారుడు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుడు ఉజ్వల్ రెడ్డితో మంత్రి మాట్లాడారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వపరంగా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నారాయణ్ రెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కూడా ఆసుపత్రికి చేరుకుని నారాయణ్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థనలు చేశారు.




# కేసీఆర్ హయాంలోనే 90%పూర్తైన ప్రాజెక్టుల ప్రారంభం సంతోషకరం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటి రంగంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తును మార్చాయని ఆయన అన్నారు.

చనాక-కొరాట బరాజ్ ప్రాజెక్టు శూన్య పాయింట్ తొంభై ఎనిమిది టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించబడిందని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ పాలనలోనే ఈ బరాజ్ పనులు తొంభై ఐదు శాతం పూర్తయ్యాయని, రెండు వేల ఇరవై మూడు సెప్టెంబర్‌లో ప్రయోగాత్మకంగా నీటి విడుదల కూడా జరిగిందని తెలిపారు. ఈ బరాజ్‌లో భాగంగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ ద్వారా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని ఎనభై తొమ్మిది గ్రామాలకు చెందిన సుమారు యాభై ఒక వేల ఎకరాలకు సాగునీరు అందేలా రూపకల్పన చేశామని చెప్పారు. ఈ ప్రాజెక్టును రెండు వేల పదహారు సంవత్సరంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో అంతర్రాష్ట్ర ఒప్పందం కుదుర్చుకుని ప్రారంభించామని గుర్తు చేశారు.

ఇక సదర్‌మాట్ బరాజ్ విషయానికి వస్తే, ఒక పాయింట్ ఐదు ఎనిమిది టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును నిర్మించామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలోనే తొంభై శాతం పనులు పూర్తయ్యాయని, దీని ద్వారా నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని సుమారు పద్దెనిమిది వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి వస్తే ఆయా జిల్లాల్లో వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.

రెండు వేల పద్నాలుగు నుంచి రెండు వేల ఇరవై మూడు వరకు సాగిన తెలంగాణ దశాబ్ద కాలంలో సాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎండిపోయిన భూములను సస్యశ్యామలం చేసి, తెలంగాణను దేశానికి ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్ పాలనకే దక్కుతుందని ఆయన అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు అనుకూల విధానాలే తెలంగాణ వ్యవసాయ బలానికి పునాది అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్ మెట్రో రెండో దశపై వేగం అవసరం : కిషన్ రెడ్డి

హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిలో జరుగుతున్న జాప్యాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించిన మెట్రో రెండో దశ ప్రాజెక్టు ప్రజల అవసరాలకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

మెట్రో రెండో దశకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని కిషన్ రెడ్డి లేఖలో గుర్తు చేశారు. అయితే మొదటి దశను ప్రైవేట్ సంస్థ నుంచి స్వాధీనం చేసుకునే ప్రక్రియ పూర్తైన తర్వాతే రెండో దశపై సమన్వయం ప్రారంభించాలన్న అవగాహన ముందుగానే ఉందని తెలిపారు. ఈ మేరకు ఇరు ప్రభుత్వాల మధ్య ఒప్పుకున్న సంయుక్త కమిటీ ద్వారా పనులు ముందుకు సాగాల్సి ఉందని స్పష్టం చేశారు. సంయుక్త కమిటీకి తెలంగాణ ప్రభుత్వం నుంచి అధికారులను ఇప్పటికీ నామినేట్ చేయకపోవడం వల్ల సమన్వయం ఆలస్యం అవుతోందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులను కమిటీకి నియమిస్తే, కేంద్రం-రాష్ట్రం


జీ. किशन रेड्डी
జి. కిషన్ రెడ్డి
G. Kishan Reddy

कोयला एवं खान मंत्री
भारत सरकार
नई दिल्ली
MINISTER OF COAL AND MINES
GOVERNMENT OF INDIA
NEW DELHI

MoCoal&Mines/Camp Office/New Delhi/ 030 /2026

తేదీ: 15 జనవరి 2026

గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారికి, నమస్కారం,

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిన విషయం తెలిసిందే. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను L&T నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరు ప్రకటించారు.

నేను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మనోహర్‌లాల్ ఖట్టర్ గారిని కలిసి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి చర్చించాను. ముందుగా మెట్రో మొదటి దశను L&T నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని చెప్పారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి శ్రీ మనోహర్‌లాల్ ఖట్టర్ గారు గుర్తు చేశారు.

మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం L&T నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటుచేయడంపై మీతో కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి శ్రీ మనోహర్‌లాల్ ఖట్టర్ గారు నాకు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని చెప్పారు. కావున మీరు వెంటనే ఇద్దరు అధికారుల పేర్లు పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

అదేవిధంగా, వేగవంతంగా L&T నుంచి 'మెట్రో నెట్‌వర్క్' ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా మనవి చేస్తున్నాను. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నాను.

భవదీయుడు

(జి.కిషన్ రెడ్డి)

Office : Room No. 353, 'A' Wing, 3rd Floor, Shastri Bhawan, New Delhi-110001, Tel. : 23387277, 23383109, 23386402
Residence: 6, Ashoka Road, New Delhi- 110001, Tel: 21411415, 21411403

మధ్య సమన్వయం ప్రారంభమై మెట్రో విస్తరణ పనులు వేగవంతం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ నగర ప్రజల పెద్ద ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని మెట్రో రెండో దశను ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రవాణా సమస్యల పరిష్కారం, కాలుష్య నియంత్రణ, నగర విస్తరణకు మెట్రో ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రభుత్వాల మధ్య సమన్వయంతోనే ఈ ప్రాజెక్టు విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.





# ఎమ్మెల్యే మెగారెడ్డిని కలిసిన వెల్టూర్ వార్డు సభ్యురాలు మద్దూర్ స్వాతి

**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు)::** వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డిని వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యురాలు మద్దూరు స్వాతి భర్త నరసింహాతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, సమృద్ధి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, గ్రామస్థాయి నాయకుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో , పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పనిచేయాలని ఆయన మద్దూర్ స్వాతికి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్టూర్ అభివృద్ధిపై ఎమ్మెల్యే మేఘా రెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి పత్రం

- **వెల్టూర్ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ**
- **వెల్టూర్ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్**



**వనపర్తి,జనవరి16 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డిని వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వెల్టూర్ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డె శేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఎమ్మెల్యేను కలిసి వెల్టూర్ గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను కూడిన వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వెల్టూర్ గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యేతో విస్తృతంగా చర్చించినట్లు వడ్డె శేఖర్ తెలిపారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై వెల్టూర్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్ ఏర్పాటు, గ్రామంలో బ్యాంకు స్థాపన, వారాంతపు సంత నిర్వహణకు అవసరమైన భూమి కేటాయింపు అంశాలను వినతి పత్రం ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అదేవిధంగా త్వరలో జరగనున్న జిల్లాల పునర్విభజన నేపథ్యంలో వెల్టూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే అంశాన్ని క్యాబినెట్‌లో చర్చించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. గ్రామంలోని హైస్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌తో పాటు, కొన్ని కులాలకు సంబంధించిన కమ్యూనిటీ భవనాల నిర్మాణ అంశాలపై కూడా వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి గ్రామానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు వడ్డె శేఖర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వెల్టూర్ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డె శేఖర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, సీనియర్ నాయకులు రవీందర్, వివేక్, గుండెల ఆంజనేయులు, మద్దూర్ వెంకటయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.





# క్రీడలతో శారీరక మానసిక దృఢత్వం

- **వెల్టూర్ ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతులు అందజేత**
- **మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి**

**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన వెల్టూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ వారియర్స్ జట్టు విజేతగా నిలవగా, గోల్డెన్ ఈగేల్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్లకు గ్రామ సర్పంచ్ అశోక్ ముఖ్య అతిథిగా హాజరై, మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం కూడా పెంపొందుతుందని అన్నారు.గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలో ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.టోర్నమెంట్ నిర్వహణకు ముందుగా క్రీడా మైదానాన్ని శుభ్రం చేయించి, క్రీడాకారులకు టీ షర్టులను అందజేసి ప్రోత్సహించిన గ్రామ సర్పంచ్ అశోక్‌కు క్రీడాకారులు ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సహకారం అందించిన వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్‌ను కూడా క్రీడాకారులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామస్థాయిలో క్రీడలకు అందుతున్న ఈ ప్రోత్సాహం యువతలో మరింత ఉత్సాహాన్ని నింపుతోందని క్రీడాకారులు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ వాతావరణంలో ఉత్సాహంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వెల్టూర్ కాంగ్రెస్ నాయకులు



**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై జలంధర్ రెడ్డిని వెల్టూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్ ఆధ్వర్యంలో నాయకులు ఎస్సై జలంధర్ రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు ఆయనకు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఎస్సై జలంధర్ రెడ్డి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతిభద్రతలను మరింత పటిష్టంగా అమలు చేస్తారని భరోసా ఇచ్చారు. అలాగే, గ్రామస్థాయి సమస్యల పరిష్కారంలో పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, రవీందర్, గుండెల అంజనేయులు, మద్దూర్ నరసింహ, వినయ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్దిగట్ల గ్రామంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



- **మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు**

**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిగట్ల గ్రామ సర్పంచ్ మేకల రాములు ముఖ్య అతిథిగా హాజరై ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన మహిళలకు, నిర్వాహకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుతూ గ్రామ ఐక్యతను పెంపొందించిన ఈ ముగ్గుల పోటీలు భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జగత్ పల్లిలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

## క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట డా. జిల్లెల చిన్నారెడ్డి





**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.పెద్దమందడి మండలం జగత్ పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జగత్ పల్లి ప్రీమియర్ లీగ్ టీం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక సర్పంచ్ పెంటన్న యాదవ్‌తో కలిసి విజేతలు, రన్నర్స్‌కు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు.ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో సుమారు 20 జట్లు పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్‌కు గోపాల్పేట మండలం ఎర్రగట్టు తండా జట్టు, పెద్దమందడి అంబేద్కర్ యూత్ జట్లు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎర్రగట్టు తండా జట్టు 89 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన పెద్దమందడి అంబేద్కర్ యూత్ జట్టు 47 పరుగులకే పరిమితమైంది. దీంతో 42 పరుగుల తేడాతో ఎర్రగట్టు తండా జట్టు విజేతగా నిలిచి రూ.20,000 నగదు బహుమతితో పాటు మెమొంటో అందుకుంది.రన్నర్స్‌గా నిలిచిన పెద్దమందడి అంబేద్కర్ యూత్ జట్టు రూ.10,000 నగదు బహుమతితో పాటు మెమొంటో అందుకుంది.

అలాగే ఎర్రగట్టు తండాకు చెందిన రాజేందర్‌ను బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా, పెద్దమందడికి చెందిన శివను బెస్ట్ బౌలర్‌గా ఎంపిక చేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ, పల్లెల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన క్రీడలలో క్రికెట్‌కు విశేష ఆదరణ ఉందని, అలాగే ఫుట్ బాల్ కూడా ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రాచుర్యంలో ఉందని అన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ ప్రఖ్యాత ఫుట్ బాల్ క్రీడాకారుడు మెస్సితో స్నేహపూర్వక మ్యాచ్ ఆడి రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని గుర్తు చేశారు.క్రీడలు దేహదారుఢ్యంతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటన్న యాదవ్, మాజీ సర్పంచులు పలుస నిరంజన్ గౌడ్, మోహన్ కుమార్ యాదవ్, పీసీసీ కార్యదర్శి నందిమల్ల యాదయ్య, తాజా మాజీ డీసీసీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, ప్రభుత్వ న్యాయవాది, వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. కిరణ్ కుమార్, క్రీడల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి.!





## ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**అశ్వారావుపేట, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం జగ్గారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్గారం, బాలరాజుగూడెం రెండు గ్రామ పంచాయతీల స్థాయి వాలీబాల్ టోర్నీ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు యువతకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. తాను గతంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేసిన అనుభవంతో క్రీడలపై ప్రత్యేక ఆసక్తి ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా ఉండాలంటే క్రీడలే సరైన మార్గమని అన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడల్లో ప్రతిభ చూపే యువతకు ప్రభుత్వాల ద్వారా ఉన్నత అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మద్యం, మత్తు పదార్థాలు, మారకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వంకా జానకిరాముడు, కీసరి లక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బండబావి ప్రాంతాన్ని మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ చివరి దశ డిజైన్ పరిశీలన





◆ జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా,కార్పొరేటర్ ప్రభుదాస్

**నాచారం , జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని బండబావి ప్రాంతాన్ని జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సందర్శించి, అక్కడ నిర్మించబోయే మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ చివరి దశ డిజైన్‌ను కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, బండబావి ప్రాంతంలో మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రెండు దశలుగా ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. మొదటి దశ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అప్పటి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ చొరవతో అనుమతులు లభించాయని చెప్పారు. రెండవ దశ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌కు ప్రతిపాదన పంపించాలని కోరిన నేపథ్యంలో, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా బండబావి ప్రాంతాన్ని సందర్శించి డిజైన్‌ను పరిశీలించారని వివరించారు.డిజైన్‌ను పరిశీలించిన అనంతరం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా త్వరలోనే మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. బండబావి ప్రాంత అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టు కోసం కృషి చేస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్, ఆర్ వి కర్ణన్ ,ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రణాళిక ప్రకారం పనులు త్వరగా ప్రారంభమయ్యేలా సహకరించాలని వారిని కోరారు.ఈ కార్యక్రమంలో నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానందం, సూపరింటెండెంట్ ఇంజనీర్ హరికిషోర్, డీఈ ఉమా మహేశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# త్రిపురనేని రామస్వామి 87వ వర్ధంతి సంస్మరణ సభ





**ఏ ఎస్ రావు నగర్, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రముఖ సంఘసంస్కర్త, స్వాతంత్ర పోరాట యోధుడు త్రిపురనేని రామస్వామి 87వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం-స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం కమలానగర్ సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ముందుగా త్రిపురనేని రామస్వామి చిత్రపటానికి స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, ప్రముఖ విద్యావేత్త పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ త్రిపురనేని రామస్వామి గొప్ప సంఘసంస్కర్తగా బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. వేదాలలోని అంశాలను తెలుగులోకి అనువదించి ప్రజలకు మంచి-చెడు విషయాలను స్పష్టంగా తెలియజేశారని అన్నారు. సూత పురాణం, శంభూక వధ వంటి రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని తెలిపారు. 1935లోనే తెనాలి పట్టణ మేయర్‌గా పనిచేసి జంతుబలులను నిషేధించిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. సీనియర్ నాయకుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ తెలుగు సమాజంలో చైతన్య దీప్తిని వెలిగించిన మహానుభావుడు త్రిపురనేని రామస్వామి అని కొనియాడారు. బ్రాహ్మణులు నిర్వహించే వివాహ క్రతువులను తెలుగులోకి అనువదించి స్వయంగా అనేక వివాహాలు నిర్వహించారని తెలిపారు. బ్రాహ్మణేతరులను సిద్ధం చేసి బ్రాహ్మణీయ భావజాలానికి ప్రత్యామ్నాయ దారిని చూపిన గొప్ప సంస్కర్తగా ఆయన నిలిచారని అన్నారు. లండన్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసి స్వాతంత్ర పోరాటంలో పాల్గొని, తన రచనల ద్వారా ఉద్యమాలకు ఊపునిచ్చారని పేర్కొన్నారు.సంస్మరణ కార్యక్రమంలో భాగంగా జ్యోతిరావు పూలే రచించిన 'గులాంగిరి' పుస్తక పఠనం నిర్వహించారు. ఈ పఠనంలో జయరాజు, పద్మావతి, శ్రీమన్నారాయణ, కృష్ణమాచార్యులు, యాదగిరిరావు పాల్గొన్నారు. అనంతరం సభికులందరూ త్రిపురనేని రామస్వామి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. రిషి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.ఈ కార్యక్రమంలో జయరాజు, శ్రీనివాసరావు, పార్థసారథి, రాజేశ్వరరావు, ఎం. భాస్కర్ రావు, గౌస్య, దుర్గాచార్యులు, బాలు, శశాంక్, రుక్కయ్య, శారద, రిషి, నరసింహారావు, ఆర్.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో 'అరైవ్ అలైవ్ క్యాంపైన్–2026' అవగాహన సదస్సు



**కుషాయిగూడ, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించిన "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ సిబ్బందికి కుషాయిగూడ పోలీసులు అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ కె. మనోహర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. డ్రైవింగ్ సమయంలో ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ సదస్సులో ఏసీపీ వై. వెంకట్ రెడ్డి, కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్, శ్రీకరన్ హాస్పిటల్ డాక్టర్, కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రామలక్ష్మణ రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. వెంకన్న, సిహెచ్. సాయిలు పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా, ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులు మరియు ప్రమాద బాధితులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి, వారి అనుభవాలను ఇతరులతో పంచుకునేలా చేయడం ద్వారా సదస్సుకు భావోద్వేగపూరితతను తీసుకొచ్చారు. వారి మాటలు అందరిలోనూ జాగ్రత్తగా ఉండాలనే భావనను మరింత బలపరిచాయి.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బంది, రోడ్ సేఫ్టీ సిబ్బంది, ఆర్టీసీ యూనియన్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే



◆ ఆటో ర్యాలీని ప్రారంభించిన సిపిఐ నేత ప్రకాష్బాబు

**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** కార్మిక హక్కులు, సంక్షేమం కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్బాబు తెలిపారు. శుక్రవారం శ్రీశ్రీ సెంటర్లో శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ ప్రచారంలో భాగంగా ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్బాబు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల శ్రమకు తగిన వేతనం లభించడం లేదన్నారు. శ్రమకు తగిన విధంగా వేతనం లభించే చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ప్రకాష్బాబు ఆరోపించారు. మోడీ తెచ్చిన లేబర్ కోడ్లు కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని భవిష్యత్తులో కార్మిక వర్గం మరిన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుందని యావత్ కార్మిక లోకం భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధులు కావాలన్నారు. ఆటో ర్యాలీ శ్రీశ్రీ విగ్రహం వద్ద ప్రారంభమై నగరంలోని అన్ని ప్రధాన వీధుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి టి. రామాంజనేయులు, హవేలి ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి. మోహన్రావు, శ్రీనివాసరావు, జాకీర్, ఆముదాల వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కూలి వెంకటయ్య అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేసిన బోధస్ లక్ష్మీనారాయణ



**కుషాయిగూడ, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ బ్లాక్ నెంబర్-2లో నివాసం ఉంటూ కూలి పనితో జీవనం కొనసాగిస్తున్న వెంకటయ్య (కూలి) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ, ఆకస్మికంగా మృతి చెందాడు. వెంకటయ్య మరణవార్త తెలుసుకున్న టీఆర్ఎస్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ సీనియర్ నాయకులు బోధస్ లక్ష్మీనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వెంకటయ్య అంత్యక్రియల కోసం ఆయన కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన బోధస్ లక్ష్మీనారాయణకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.వెంకటయ్య కుటుంబం తీవ్రమైన పేదరికంలో జీవిస్తోందని, జీవనోపాధి కోసం సొంత గ్రామాన్ని విడిచి నెహ్రూ నగర్‌కు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోందని స్థానికులు తెలిపారు. వెంకటయ్య అనారోగ్యం కారణంగా కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బోధస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వెంకటయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే వెంకటయ్య మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఎవరైనా అనాధలు, నిరుపేదలు సహాయం కోరితే తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.



## మణిగిల్ల గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల, ఎడ్లబండి పోటీలు

- **విజేతలకు బహుమతులు అందజేసిన సర్పంచ్ పలస శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో బోడి ప్రణవి (తండ్రి: బోడి గణేష్) మొదటి బహుమతి, వై లాస్య (తండ్రి: విష్ణువర్ధన్ రెడ్డి) రెండవ బహుమతి, గొంది లాస్య (తండ్రి: గొంది రాంరెడ్డి) మూడవ బహుమతి సాధించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సొలేషన్ ప్రైజ్ అందజేశారు.సీనియర్స్ ముగ్గుల పోటీల్లో శైలజ (తండ్రి: నీలోజి) మొదటి బహుమతి, పి. ఝాన్సీ (తండ్రి: బీచుపల్లి) రెండవ బహుమతి, ఊదరి అక్షయ (తండ్రి: ఊదిరి రాములు) మూడవ బహుమతి పొందారు. ఈ విభాగంలో కూడా పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సొలేషన్ ప్రైజ్ ఇచ్చారు. మకర సంక్రాంతి సందర్భంగా ఎడ్ల బండి పోటీల అలంకరణ కార్యక్రమం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో జాజలి రాములు మొదటి బహుమతి, బండపల్లి ఆంజనేయులు రెండవ బహుమతి, మండ్ల బాలయ్య మూడవ బహుమతి, మండ్ల బుచ్చన్న తదుపరి బహుమతి పొందారు. ఎడ్లబండి పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ ప్రైజ్ అందజేశారు.గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద గ్రామ పెద్దల సమక్షంలో బహుమతుల ప్రదానం జరిగింది. కనుమ పండుగ సందర్భంగా బాల, బాలికలకు చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద పతంగుల పోటీలు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## జనవరి 18న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

- **సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు**

**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** వందేళ్ల సుధీర్ఘ పోరాటాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేసేందుకు 2026 జనవరి 18న ఖమ్మంలో చారిత్రక నభ నిర్వహిస్తున్నట్లు సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 18న సాయంత్రం 3 గంటలకు డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాదిమందితో బహిరంగ నిర్వహిస్తున్నామని ఈ నభకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలిరానున్నారు. నలభై దేశాల నుండి ప్రతినిధులతో పాటు జాతీయ కార్యదర్శి రాజా, సిపిఐ జాతీయ నాయకత్వంతో పాటు అన్ని రాష్ట్రాల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, లక్షలాది మంది కార్యకర్తలు హాజరవుతున్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరవుతన్నారని చింతకాని మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బస్సులు, ఆటోలు, ట్రాక్టర్లు అందుబాటులో ఉన్న వాహనాలతో భారీగా తరలిరానున్నారన్నారు.. రైతులు, మహిళలు, యువత, శ్రామిక కార్మికులు అన్ని వర్గాలు దండులా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వాసు, కరీముల్లా, సాయి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## పెంటన్న యాదవ్ గెలుపు జగత్‌పల్లి గ్రామాభివృద్ధికి కిలక మలుపు

- **డా. జిల్లెల చిన్నారెడ్డి**

**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెంటన్న యాదవ్ గెలుపు జగత్ పల్లి గ్రామాభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెద్దమందడి మండలం జగత్ పల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమొంటోలు అందజేశారు.ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు పెంటన్న యాదవ్‌ను భారీ మెజారిటీతో సర్పంచుగా గెలిపించుకోవడం శుభపరిణామమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేస్తూ, అధికారంలో లేని సమయంలోనూ మండల పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీని ముందుకు నడిపించారని తెలిపారు. జగత్ పల్లి గ్రామ అభివృద్ధికి తాను ఎల్లవేళలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీకగా నిలిచే పెంటన్న యాదవ్ పనితీరుపై డా. చిన్నారెడ్డి ప్రశంసలు కురిపించారు.





## వురిమళ్ల సునందకు అలిశెట్టి సాహిత్య అవార్డ్ ప్రదానం

- **పెద్దింటి అశోక్ కుమార్ చేతుల మీదుగా ఆంతర్యం కథా సంపుటి ఆవిష్కరణ**

**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా జగిత్యాలలోని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు "అలిశెట్టి సాహిత్య అవార్డును ప్రముఖ కవయిత్రి, పాఠ్య పుస్తక రచయిత, కీర్తి పురస్కార గ్రహీత వురిమళ్ల సునంద కు ప్రదానం చేశారు. సాహిత్యంలో ఆమె చేస్తున్న విశేష సేవలకు గాను ఈ అవార్డ్ దక్కినట్లు పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయితలు పెద్దింటి అశోక్ కుమార్, కె.వి.నరేందర్ చేతుల మీదుగా సునంద రాసిన ఆంతర్యం కథా సంపుటి ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీ వేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.






## కీసరలో "అరైవ్ అలైవ్ క్యాంపైన్–2026" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

- **ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞలు – రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం**

**కీసర, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా, డీజీపీ శివధర్ రెడ్డి (ఐపీఎస్) మార్గదర్శకత్వంలో రాష్ట్ర స్థాయి రోడ్డు భద్రతా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఈ క్రమంలో కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కీసర పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, ఎస్ఆర్ఓ కార్యాలయం మరియు మున్సిపల్ కార్యాలయాలలో జరిగింది.ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌డీఓ కీసర, కీసర మండల తహసీల్దార్, కీసర సర్కిల్ మున్సిపల్ కమిషనర్, కీసర ఎస్ఆర్ఓతో పాటు పోలీస్ అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగాన్ని కచ్చితంగా అమలు చేస్తామని, మద్యం సేవించి వాహనం నడపమని, అధిక వేగాన్ని నివారించి ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పాదచారులు, ఇతర రోడ్డు వినియోగదారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతామని సంకల్పం చేశారు."సజీవంగా గమ్యస్థానానికి చేరుకోవాలి" అనే నినాదంతో "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు పిలుపునిచ్చారు.







## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి.!

**ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

**అశ్వారావుపేట, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం జగ్గారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్గారం, బాలరాజుగూడెం రెండు గ్రామ పంచాయతీల స్థాయి వాలీబాల్ టోర్నీ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి టోర్నీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు యువతకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. తాను గతంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేసిన అనుభవంతో క్రీడలపై ప్రత్యేక ఆసక్తి ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా ఉండాలంటే క్రీడలే సరైన మార్గమని అన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తోందని, క్రీడల్లో ప్రతిభ చూపే యువతకు ప్రభుత్వాల ద్వారా ఉన్నత అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మద్యం, మత్తు పదార్థాలు, మారకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వంకా జానకిరాముడు, కీసరి లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# రోడ్డు భద్రత ప్రమాణాలను విధిగా పాటించాలి

◆ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పది రోజుల "అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026" లో భాగంగా రెండవ రోజు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొని రోడ్డు భద్రత ప్రమాణాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్ పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వంటి తప్పనిసరి పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకట రెడ్డి మాట్లాడుతూ, పౌరుల ప్రవర్తనలో మార్పు మరియు పౌర సమాజ అవగాహన రోడ్డు భద్రతలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. 2025 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఐదు లక్షలకుపైగా రోడ్డు ప్రమాదాలు జరగగా, దాదాపు రెండు లక్షల మంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన సందేహాలను ఉద్యోగులకు నివృత్తి చేస్తూ, "రహదారి భద్రత ప్రతిజ్ఞ" ను చేయించారు.షామీర్పేట్ సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ, హెల్మెట్ స్ట్రాప్ సరిగా ఫిక్స్ చేయకపోవడం, సీట్బెల్ట్ ధరించకపోవడం వంటి చిన్న నిర్లక్ష్యాలే కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. సెల్ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం,రాంగ్ లేన్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు.ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, వేగ నియంత్రణ మరియు భద్రతా ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, చుట్టూ ఉన్న వారికీ తెలియజేయడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపద రక్షణలో కమ్యూనిస్టులు

◆ చారిత్రిక ఘటనలో భాగస్వాములు కండి
◆ మా నినాదాలే పరిపాలనా నిర్ణయాలు
◆ స్వేచ్ఛను హరిస్తున్న కేంద్ర పాలకులు
◆ మీడియా సమావేశంలో కూనంనేని




**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే సభ చరిత్రలో నిలిచి పోనుందని, ఈ చారిత్రిక ఘటనలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం ఎస్ఆర్అండ్బిజి ఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా తో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఖమ్మం సభ కమ్యూనిస్టుల పురోగమనానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం లక్ష్యంతో పోరాడిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన తెలిపారు, అధికారంలో ఉన్నా లేకున్నా మా నినాదాలే పాలకుల విధాన నిర్ణయాలుగా మారాయని గతంలో బ్యాంకుల జాతీయకరణ, మిగులు భూముల పంపిణీ, దున్నేవానికే భూమి సహా పలు సంక్షేమ పథకాలు, కమ్యూనిస్టు నినాదాలు, పోరాటాల కారణంగానే చట్టాలుగా మారి అమలయ్యాయని కూనంనేని తెలిపారు. 21వ శతాబ్దంలోనూ జాతీయ ఉపాధి హామీ పథకం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనన్నారు. దేశ సంపద రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణను కమ్యూనిస్టులు బాధ్యతగా స్వీకరించారని కమ్యూనిస్టులు లేకుంటే ఎలసి, బ్యాంకులు, రైల్వేలు, కోల్ ఇండియా సహా దేశీయ సుప్రసిద్ధ సంస్థలు ఎప్పుడో ప్రైవేట్ శక్తుల పరమయ్యేవని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటం ప్రజాసంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమేనన్నారు. ఏ స్వేచ్ఛ కోసం పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామో అదే స్వేచ్ఛను బిజెపి హరించివేస్తుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థి, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతుందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కే క్రమంలోనే పాలకులు యూనియన్ల రద్దు అంటున్నారని మరో పక్క అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. 1925లో సిపిఐ ఆవిర్భావించిన తర్వాత నిర్బంధాల నడుమ నిషేధానికి గురైందని కమ్యూనిస్టుల భావాజాలంతో అనేక మంది కాంగ్రెస్లో చేరి సోషలిస్టు

సిపిఐ పోరాడుతుందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కే క్రమంలోనే పాలకులు యూనియన్ల రద్దు అంటున్నారని మరో పక్క అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. 1925లో సిపిఐ ఆవిర్భావించిన తర్వాత నిర్బంధాల నడుమ నిషేధానికి గురైందని కమ్యూనిస్టుల భావాజాలంతో అనేక మంది కాంగ్రెస్లో చేరి సోషలిస్టు విభాగం ఏర్పాటు చేసి పోరాటం చేశారని కూనంనేని తెలిపారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం కమ్యూనిస్టు నాయకుడు అస్లాత్ మహని తొలిసారి ఇచ్చాడని ఆ నినాదాన్ని భగత్సంగ్ విశ్వ వ్యాపితం చేశాడన్నారు. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయమే సరైన ప్రత్యామ్నాయమని ఆయన తెలిపారు. చిట్టగాంగ్, గదర్, తెబగా, వాయిలార్, పోనప్ప సహా పలు పోరాటాలను నిర్వహించిన వారంతా సిపిఐలో చేరారన్నారు. మీరట్, కాన్పూర్, విషాద సహా పలు కుట్ర కేసులను ఎదుర్కొని నిలబడ్డ సిపిఐ మరో వందేళ్లయినా ప్రజల పక్షాన నిలబడేందుకు సిద్ధమేనని సాంబశివరావు తెలిపారు. వందేళ్ల వేడుక భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిని ఇవ్వనుందన్నారు.

**రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలు: ప్రకాష్ బాబు**

శతాబ్ద కాలం పాటు పోరాటం సాగించిన సిపిఐ రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్బాబు తెలిపారు. మీడియా సమావేశంలో ప్రకాష్ బాబు మాట్లాడుతూ 2024 డిసెంబర్ 24 శతాబ్ది ఉత్సవాలు కాన్పూర్లో ప్రారంభమయ్యాయని ముగింపు కమ్యూనిస్టు ఖిల్లా ఖమ్మంలో ముగుస్తున్నాయన్నారు. శతాబ్ద కాలం ప్రజల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పనిచేశామని అదే సిద్ధాంతం, లక్ష్యంతో భవిష్యత్తులోనూ పోరాడతామన్నారు. మతోన్మాద శక్తులను నిలువరించే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు.

మూడు ప్రదర్శనల ద్వారా సభా స్థలికి బాగం మూడు ప్రదర్శనల ద్వారా ప్రజలు బహిరంగ సభా స్థలికి చేరుకుంటారని ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. పెవిలియన్ మైదానం నుంచి జన సేవాదళ్ ప్రదర్శన ప్రారంభమవుతుందని దీనికి రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, నాయకత్వం వహిస్తారని తర్వాత కళాకారుల వృత్తి సంఘాల ప్రదర్శన ఉంటుందన్నారు. రెండవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందని దీనికి జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎసి, సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మూడవ ప్రదర్శన నయాబజార్ కళాశాల కాల్వొడ్డు నుంచి ప్రారంభమవుతుందని దీనికి ఏపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దండి సురేష్ నాయకత్వం వహిస్తారని హేమంతరావు తెలిపారు. మూడు ప్రదర్శనలు సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద మూడు ప్రదర్శనలకు జాతీయ నాయకులు స్వాగతం పలికేందుకు వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళారూపాల ప్రదర్శనకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్ కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా స్విచ్కో సంచార వాహనాన్ని పరిశీలించిన కలెక్టర్






**మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ సహకారంతో స్విచ్కో సంస్థ నిర్వహిస్తున్న "స్వచ్ఛ భారత్ యాత్ర - చక్రాలపై సుస్థిర అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణకు రూపొందించిన సంచార వాహనాన్ని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి వాహనంలోని సాంకేతిక ప్రత్యేకతలను ఆయన పరిశీలించారు.ఈ సంచార వాహనంలో ప్లాస్టిక్ బాటిళ్లను కుదించే బెయిలింగ్ యంత్రం, సానిటరీ ప్యాడ్స్ ఇన్సినరేటర్, బయో వ్యర్థాల కంపోస్టింగ్ యూనిట్ వంటి సృజనాత్మక పద్ధతులు ఏర్పాటు చేయడం విశేషం. వీటి ద్వారా వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని స్విచ్కో బృందం జిల్లా అధికారులకు వివరించింది.అలాగే కలెక్టరేట్ సిబ్బందికి వ్యర్థాల వేర్పాటు, పునర్వినియోగంపై అవగాహన కల్పించి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.ఈ స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా స్విచ్కో బృందం ప్రతిరోజూ సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తుందని, అలాగే ఈ సంచార వాహనాన్ని 12వ అంతర్జాతీయ ప్లాస్టిక్స్ ప్రదర్శన - ప్లాస్ట్ ఇండియా 2026 సదస్సులో ప్రదర్శనకు ఉంచనున్నట్లు స్విచ్కో ప్రతినిధులు తెలిపారు.

# సంక్రాంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆత్మీయ సమావేశం



◆ 'పద్మశ్రీ' మందకృష్ణ మాదిగను శాలువతో ఘనంగా సత్కరించిన సురేష్ ఇడపాక

**ఉప్పల్, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పంగా ప్రణయ్ మాదిగ నివాసంలో గురువారం ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగతో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా మాదిగ కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఇటీవల ప్రమాదవశాత్తు గాయాల బారినబడి కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం బెడ్రెస్ట్లో ఉన్న ప్రణయ్ మాదిగ తండ్రిని మందకృష్ణ మాదిగ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా మాట్లాడారు.ఈ సందర్భంగా తెలంగాణ ఎస్సీ-ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి సురేష్ ఇడపాక జర్నలిస్టులపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సురేష్ ఇడపాక మందకృష్ణ మాదిగను శాలువతో ఘనంగా సత్కరించారు.తదనం తరం ప్రణయ్ మాదిగ నివాసంలో మాదిగ కుటుంబ సభ్యులతో కలిసి మందకృష్ణ మాదిగ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాయకుడు కొరపాక అంజి మాదిగ, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పంగా ప్రణయ్ మాదిగ, తెలంగాణ ఎస్సీ-ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి సురేష్ ఇడపాక, ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకుడు ఐలేని మహేష్, డి. యక్కి, మేడిపల్లి మండలానికి చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువ క్రీడాకారులకు ప్రోత్సాహం – వాలీబాల్ కిట్ అందజేసిన యువకులు



**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ ఎస్సీ కాలనీ యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి అవసరమయ్యేది సరైన ప్రోత్సాహమేనని పలువురు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వెల్టూర్ ఎస్సీ కాలనీ యువ క్రీడాకారుల ప్రోత్సాహార్థం వాలీబాల్ కిట్ను గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ యువకులు శ్యామ్, రాఘవ, మధు మరియు శ్రీను సంయుక్తంగా అందజేశారు.ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ..ఆటలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా క్రమశిక్షణ, శారీరక దృఢత్వం మరియు టీమ్ వర్క్ను అలవర్చుతాయని అన్నారు. యువత క్రీడల వైపు మరింత ఆకర్షితులై తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.పెద్దమందడి మండలం వెల్టూర్ ఎస్సీ కాలనీ యువ క్రీడాకారులు మైదానంలో మెరిసి, భవిష్యత్తులో గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం



**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ళ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ పార్టీ జిల్లా సమితి సూచన మేరకు చింతకాని మండలం నేరడ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రాత్రి ముగ్గుల పోటీలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ పోటీల్లో మొత్తం 30 మంది పాల్గొన్నారు మొదటి బహుమతి మట్టా నందిని రెండో బహుమతి షేక్ సమీరా మూడు బహుమతి తుళ్లూరి త్రివేణి గెలుపొందిన వారికి బహుమతిలు గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి గ్రామ సహాయ కార్యదర్శి మట్టా రవి పొట్లపల్లి కోటయ్య అన్నపు రెడ్డి గురుమూర్తి పులిపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు





# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి



- రూ. 362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ: మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

పాలేరు గడ్డపై అభివృద్ధి పండుగ

మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరుపాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.

తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ..

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది" అని స్పష్టం చేశారు.

కుంభమేళాకు మించి మేడారం ఏర్పాట్లు

సమ్మక్కసారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## బిజెపిలోకి కాకరవాయి 7వ వార్డ్ సభ్యుడు కొత్తపల్లి వసంత రవి..



**ఖమ్మం బ్యూరో, జనవరి 16(తెలంగాణ ముచ్చట్లు):** బిజెపి మద్దతుతో 7వ వార్డ్ సభ్యుడిగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న కొత్తపల్లి వసంతా రవి గురువారం భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు. ఈ చేరిక కార్యక్రమం ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా నెల్లూరు కోటేశ్వరరావు వసంతా రవికి బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకులు నల్లగట్టు ఉపేందర్, బిజెపి మండల కన్వీనర్ ఇందూరు మహేష్, గుండెపైన గంగరాజు లు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నెల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల మద్దతుతో గెలిచిన ప్రజాప్రతినిధులు కాకరవాయి బిజెపిలో చేరడం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. దేశాభివృద్ధి, రాష్ట్ర పురోగతి లక్ష్యంగా పనిచేస్తున్న బిజెపి విధానాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. కొత్తపల్లి వసంతా రవి చేరికతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం కొత్తపల్లి వసంతా రవి మాట్లాడుతూ..బిజెపి పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలను అనుసరిస్తూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి 7వ వార్డ్ ప్రజలు గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకొని మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కొత్తపల్లి వసంతా రవికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చేరికతో స్థానికంగా బిజెపి కార్యకలాపాలకు మరింత ఉత్సాహం పెరిగిందని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.






# కీసరలో “అరైవ్ అలైవ్ క్యాంపైన్–2026” రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం

- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞలు – రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

**కీసర, జనవరి 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన “అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026” కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా, డీజీపీ శివధర్ రెడ్డి (ఐపీఎస్) మార్గదర్శకత్వంలో రాష్ట్ర స్థాయి రోడ్డు భద్రతా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.ఈ క్రమంలో కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ ఆర్కపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కీసర పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, ఎస్ఆర్ఓ కార్యాలయం మరియు మున్సిపల్ కార్యాలయాలలో జరిగింది.ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌డీఓ కీసర, కీసర మండల తహసీల్దార్, కీసర సర్కిల్ మున్సిపల్ కమిషనర్, కీసర ఎస్ఆర్ఓతో పాటు పోలీస్ అధికారులు, ట్రాఫిక్ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని కచ్చితంగా అమలు చేస్తామని, మద్యం సేవించి వాహనం నడపమని, అధిక వేగాన్ని నివారించి ట్రాఫిక్ నిబంధనలను గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పాదచారులు, ఇతర రోడ్డు వినియోగదారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతామని సంకల్పం చేశారు.“సజీవంగా గమ్యస్థానానికి చేరుకోవాలి” అనే నినాదంతో “అరైవ్ అలైవ్ క్యాంపైన్-2026” లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు పిలుపునిచ్చారు.




## పామిరెడ్డిపల్లి సర్పంచ్ మధిర మంజుల దంపతులకు స్నేహితుల ఘన సన్మానం



**పెద్దమందడి,జనవరి16(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మధిర శ్రీశైలం భార్య మధిర మంజుల ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా శ్రీశైలం చిన్ననాటి స్నేహితులు, 1995-1996 బ్యాచ్‌కు చెందిన మిత్రులు శ్రీశైలం-మంజుల దంపతులను ఘనంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి వారి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ..చిన్ననాటి స్నేహం ఇప్పటికీ అలాగే కొనసాగుతుండడం ఎంతో ఆనందంగా ఉంది. స్నేహితుడి కుటుంబం సాధించిన ఈ విజయం అందరిదీ లాంటిదే అని అన్నారు.అలాగే, స్నేహం అంటే అవసరానికి మాత్రమే కాదు, ఆనందాన్ని కూడా కలిసి పంచుకోవడమే. మంజుల సర్పంచ్‌గా గెలవడం మాకు గర్వకారణం అని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజల విశ్వాసంతో సర్పంచ్‌గా ఎన్నికైన మధిర మంజుల మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, అందరి సహకారంతో పామిరెడ్డిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం స్నేహితులు,గ్రామస్తులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇద్దరు మైనర్ అమ్మాయిల ఆత్మహత్యలు..




కేరళ రాష్ట్రంలోని కొల్లాంలో ఉన్న క్రీడల శిక్షణ వసతి గృహంలో ఇద్దరు మైనర్ క్రీడాకారిణులు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున ఈ విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. ఉదయం శిక్షణకు హాజరు కాకపోవడంతో సిబ్బంది వారి గదిని పరిశీలించగా తలుపు లోపల నుంచి మూసి ఉండటంతో తెరిచి చూడగా పైకప్పు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించారు.

మృతుల్లో ఒక అమ్మాయి కోజికోడ్‌కు చెందిన 12వ తరగతి విద్యార్థిని కాగా అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతోంది. మరో అమ్మాయి తిరువనంతపురానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని కాగా కబడ్డీలో శిక్షణ తీసుకుంటోంది. ఇద్దరూ క్రీడల శిక్షణ సంస్థ నిర్వహించే వసతి గృహంలో ఉంటున్నారు.

ఈ ఘటనపై కొల్లాం తూర్పు ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని అధికారులు తెలిపారు. ఆత్మహత్యలకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

# ముంబైలో కమలం జోరు..



- థానేలో శివసేన దూకుడు.. ఫలితాల్లో హాట్ టెన్షన్!!

మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి దూకుడు ప్రదర్శిస్తోంది. ఉపముఖ్యమంత్రి ఏకనాథ్ షిండేతో జతకట్టిన భారతీయ జనతా పార్టీ చాలా మున్సిపాల్టీల్లో ముందంజలో కొనసాగుతోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 227 వార్డుల్లో ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ 62 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మరో 46 స్థానాల్లో కూడా ఆ పార్టీకి ఆధిక్యం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. షిండేకు చెందిన శివసేన 16 వార్డుల్లో లీడింగ్‌లో కొనసాగుతోంది. థాకరే సోదరులు కలిసి ప్రచారం చేసినప్పటికీ పెద్దగా ప్రభావం చూపలేదని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని వర్గం 10 స్థానాల్లో, రాజ్ థాకరే నేతృత్వంలోని వర్గం 6 స్థానాల్లో ముందంజలో ఉంది. షిండేకు బలమైన పట్టున్న థానేలో శివసేన ఆధిక్యంలో కొనసాగుతోంది. అక్కడ మొత్తం 131 వార్డుల్లో 9 వార్డుల్లో శివసేన ముందంజలో ఉంది.

పుణెలో భారతీయ జనతా పార్టీ స్పష్టమైన ఆధిక్యాన్ని కొనసాగిస్తోంది. అక్కడ 32 స్థానాల్లో ఆ పార్టీ లీడింగ్‌లో ఉండగా, అజిత్ పవార్ నేతృత్వంలోని జాతీయవాద కాంగ్రెస్ పార్టీ 14 స్థానాల్లో ముందంజలో కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 29 మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగగా, ఎగ్జిట్ పోల్స్ ప్రకారం మహాయుతి కూటమికి అనుకూల ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ముంబైలో సుమారు 52 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# జైపూర్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- **ఘన స్వాగతం పలికిన రాజస్థాన్ గవర్నర్, ముఖ్యమంత్రి**
- **ఉప ముఖ్యమంత్రుల హాజరు**
- **అధికారిక పర్యటనకు ఆరంభం**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు చేరుకున్నారు. ఆమె రాక సందర్భంగా రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిసన్‌రావు బాగ్డే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటనకు ఇది అధికారిక ఆరంభంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రులు దియా కుమారి, ప్రేమ్ చంద్ర బైర్వా పాల్గొని రాష్ట్రపతికి స్వాగతం తెలిపారు. ఉన్నతాధికారులు కూడా విమానాశ్రయానికి చేరుకుని గౌరవాభివందనం చేశారు.

రాష్ట్రపతి జైపూర్ పర్యటన సందర్భంగా రాజస్థాన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసంబంధిత అంశాలపై అధికారులతో సమీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాష్ట్రాభివృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు.

రాజ్యాంగ పరమైన బాధ్యతలు, ప్రజాసేవలో రాష్ట్రపతి పాత్రకు ఈ పర్యటన మరింత ప్రాధాన్యతను సంతరించుకుందని పలువురు పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన విజయవంతం కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించింది.





# జపాన్ విదేశాంగ మంత్రికి ఘన స్వాగతం

- **భారత్–జపాన్ వ్యూహాత్మక చర్చలు**
- **క్రీడా స్నేహబంధానికి ప్రతీకగా బహుమతుల మార్పిడి**
- **ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపిరి**

భారతదేశానికి వచ్చిన జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మోటేగికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ ఘన స్వాగతం పలికారు. ఇరు దేశాల మధ్య జరుగుతున్న వ్యూహాత్మక చర్చల సందర్భంగా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై విస్తృతంగా చర్చలు జరిగాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై పరస్పర అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలు, ఆర్థిక సహకారం, భద్రతా అంశాలు, సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యం వంటి కీలక అంశాలు ప్రాధాన్యంగా నిలిచాయి. ఆసియా ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం భారత్-జపాన్ భాగస్వామ్యం మరింత బలపడాల్సిన అవసరాన్ని ఇరు నేతలు స్పష్టం చేశారు. సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా క్రీడాపై ఉమ్మడి ఆసక్తి నిలిచింది. క్రీడల పట్ల ఉన్న పరస్పర అభిమానాన్ని ప్రతిబింబిస్తూ జపాన్ జాతీయ క్రీడా జట్టు జెర్సీని జై శంకర్‌కు తోషిమిత్సు మోటేగి అందజేశారు. ప్రతిగా భారత జాతీయ క్రీడా జట్టు ఆటగాళ్లు సంతకం చేసిన బ్యాట్‌ను జై శంకర్ ఆయనకు బహూకరించారు. ఈ బహుమతుల మార్పిడి ఇరు దేశాల మధ్య స్నేహానికి ప్రతీకగా నిలిచింది. భారత్, జపాన్ మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం కేవలం ప్రభుత్వ స్థాయికే పరిమితం కాకుండా ప్రజల మధ్య కూడా మరింత బలపడుతుందని జై శంకర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో అన్ని రంగాల్లో సహకారాన్ని విస్తరించుకుంటూ ముందుకు సాగేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్ చెరలో 16 మంది భారత నావికులు.. కేంద్రానికి కుటుంబాల విజ్ఞప్తి!



ఇరాన్‌లో అదుపులో ఉన్న 16 మంది భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని వారి కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత నెలలో సముద్ర మార్గంలో ప్రయాణిస్తున్న ఒక నౌకను స్మగ్లింగ్ అనుమానంతో ఇరాన్ నావికాదళం అదుపులోకి తీసుకుంది. ఆ నౌకలో మొత్తం 18 మంది నావికులు ఉండగా, అందులో 16 మంది భారతీయులు ఉన్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో తమ కుటుంబ సభ్యుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజులకు పైగా నిర్బంధంలో ఉన్న నావికులకు సరైన వైద్య సహాయం, న్యాయ పరిరక్షణ, ఆహార సదుపాయాలు కల్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అవసరమైతే ఇరాన్ ప్రభుత్వంతో చర్చలు జరిపి వారిని త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నావికుల కుటుంబ సభ్యులు ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కు వాయిదా వేసింది. అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న సమయంలో సుమారు 6 వేల టన్నుల ఇంధనం అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలతో నౌకను వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆ సమయంలో కొంతమంది నావికులను జైలుకు తరలించగా, మిగిలిన వారిని కఠిన నిఘాలో ఉంచినట్టు తెలుస్తోంది. ఈ నావికులంతా సముద్ర ప్రయాణాలకు అనుమతి పొందిన అర్హత కలిగినవారేనని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తమ వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కుటుంబాలు కోరుతున్నాయి.

# 9 నెలల్లో దూసుకెళ్లిన దేశ ఎగుమతులు.. 634 డాలర్ల మైలురాయి!

2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ ఎగుమతులు స్థిరమైన వృద్ధితో ముందుకు సాగుతున్నాయి. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు జరిగిన తొలి 9 నెలల్లో దేశం మొత్తం 634 డాలర్ల విలువైన ఎగుమతులను నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ కాలంలో 4.33 శాతం వృద్ధి సాధించినట్లు వాణిజ్య శాఖ ప్రాథమిక గణాంకాలు వెల్లడించాయి.

వస్తువుల ఎగుమతులు మాత్రమే లెక్కలోకి తీసుకుంటే ఈ 9 నెలల్లో 330 డాలర్ల స్థాయికి చేరాయి. ప్రపంచ మార్కెట్లలో డిమాండ్ కొనసాగడం, దేశంలో తయారీ సామర్థ్యం పెరగడం వల్ల ఈ పురోగతి సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఈ ఎగుమతుల్లో ధాన్యాలకు ముఖ్యమైన వాటా లభించింది. ముఖ్యంగా బియ్యం, గోధుమలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. అలాగే విద్యుత్ పరికరాల రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ, చేతి ఫోన్లు, ఇతర పరికరాల ఎగుమతుల్లో మంచి వృద్ధి చూపిస్తోంది. జీడిపప్పు, మాంస ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు కూడా మొత్తం ఎగుమతుల్లో కీలక పాత్ర పోషించాయి.

దేశాల వారీగా చూస్తే అమెరికా, చైనా, అరబ్ ఎమిరేట్స్, స్పెయిన్, హాంకాంగ్ దేశాలు ప్రధాన ఎగుమతి గమ్యస్థానాలుగా నిలిచాయి. ఈ దేశాల నుంచి కొనసాగుతున్న ఆర్డర్లు దేశ ఎగుమతి రంగానికి బలాన్ని ఇస్తున్నాయి. మౌలిక వసతుల అభివృద్ధి, తయారీ రంగంలో పెట్టుబడులు, ఎగుమతులకు అనుకూలమైన విధానాలు కొనసాగితే రాబోయే నెలల్లో కూడా దేశ ఎగుమతులు మరింత వృద్ధి సాధించే అవకాశముందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మకు భారీ ఎదురుదెబ్బ.. అభిశంసన పిటిషన్ తిరస్కరణతో షాక్..!



అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. తనపై చేపట్టిన అభిశంసన ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ఆయన పిటిషన్ వేశారు. అయితే జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేస్తూ కీలక తీర్పు ఇచ్చింది.

జడ్జీల చట్టం ప్రకారం జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసనకు ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై వాదనలు పూర్తయిన తర్వాత జనవరి 8న తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు, ఇప్పుడు స్పష్టమైన నిర్ణయం వెల్లడించింది.

గత సంవత్సరం మార్చి 14న జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలను ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది అక్కడ భారీ మొత్తంలో కాలిన నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్రమ సంపాదన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అయితే ఆ ఆరోపణలను జస్టిస్ వర్మ ఖండించారు. ఈ ఘటన తర్వాత ఆయనను ఢిల్లీ నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. తదుపరి చర్యలు పూర్తయ్యే వరకు న్యాయమూర్తి విధులు నిర్వహించవద్దని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఈ కేసులో అప్పటి ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణకు ఆదేశాలు ఇచ్చారు. తాజాగా పిటిషన్ తిరస్కరణతో జస్టిస్ యశ్వంత్ వర్మకు న్యాయపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్టుగా న్యాయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

## ఐక్యరాజ్య సమితిలో మళ్లీ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాకిస్థాన్.. తీవ్రంగా స్పందించిన భారత్..!

ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాకిస్థాన్ మరోసారి కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా భారత్ తీవ్రంగా స్పందించింది. జమ్మూ కశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగమని, అది ఎప్పటికీ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేసింది. అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేస్తూ పాకిస్థాన్ పదే పదే అబద్ధాలు ప్రచారం చేస్తోందని భారత ప్రతినిధి మండిపడ్డారు.

సమావేశంలో పాకిస్థాన్ శాశ్వత రాయబారి అసిమ్ ఇఫ్తికర్ అహ్మద్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనికి ప్రతిస్పందనగా భారత శాశ్వత మిషన్ కౌన్సిలర్ ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. జమ్మూ కశ్మీర్ ప్రజలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకుంటున్నారని తెలిపారు. కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ సూచనలు అవసరం లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై అసత్యాలను ప్రచారం చేయడం ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదని పాకిస్థాన్‌కు హితవు పలికారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరికాదని, శాంతి భద్రతల పరిరక్షణే ఐక్యరాజ్య సమితి ప్రధాన లక్ష్యమని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న హింస, సంఘర్షణలకు ముగింపు పలికే దిశగా అన్ని దేశాలు బాధ్యతగా వ్యవహరించాలని భారత్ కోరింది.

## బంగారం రేటు ఆగిందా?..



దేశీయ మార్కెట్లో బంగారం ధరలు ఈరోజు దాదాపు స్థిరంగా కొనసాగుతున్నాయి. గత వారం భారీగా పెరిగిన తర్వాత ఇప్పుడు ధరల్లో పెద్దగా మార్పు కనిపించడంలేదు. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు 143610 రూపాయల వద్ద ట్రేడవుతుండగా, నిన్నతో పోలిస్తే కేవలం 10 రూపాయల మాత్రమే తక్కువైంది. 22 క్యారెట్ల బంగారం కూడా దాదాపు అదే స్థాయిలో కొనసాగుతోంది.

ఈ వారం ప్రారంభంలో బంగారం ధరలు పన్నులతో కలిపి 10 గ్రాములకు 147000 రూపాయల స్థాయిని దాటి చరిత్రలోనే గరిష్టానికి చేరాయి. అయితే ఇప్పుడు విదేశీ కరెన్సీ బలపడటం, అంతర్జాతీయ మార్కెట్లలో మారుతున్న పరిస్థితుల కారణంగా పెట్టుబడిదారులు లాభాలు తీసుకోవడం ప్రారంభించారు. దీని వల్ల ధరలు కొంత స్థిరంగా మారాయి.

నగరాల వారీగా చూస్తే హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం 131640 రూపాయలకు, 24 క్యారెట్ల బంగారం 143610 రూపాయలకు లభిస్తోంది. చెన్నైలో ధరలు కొంచెం ఎక్కువగా ఉండి 24 క్యారెట్లకు 144990 రూపాయలు, 22 క్యారెట్లకు 132910 రూపాయలుగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ప్రాంతీయ పన్నుల ఆధారంగా కొద్దిపాటి తేడాలు ఉండే అవకాశం ఉంది.

అంతర్జాతీయంగా బంగారం ధర స్వల్పంగా తగ్గింది. అమెరికాలో ఉద్యోగ గణాంకాలు బలంగా ఉండటంతో అక్కడి కరెన్సీ బలపడింది. దీని ప్రభావం బంగారంపై పడుతోంది. ఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 7 శాతం పెరిగాయి. ప్రస్తుతం వ్యాపారులు లాభాలను తీసుకుంటూ కొంత వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

గత ఏడాది ఇదే సమయంలో బంగారం ధరలు 10 గ్రాములకు సుమారు 78000 రూపాయల వద్ద ఉండగా, ఇప్పుడు 143000 రూపాయలకు చేరడం గమనార్హం. కేంద్ర బ్యాంకులు భారీగా బంగారం కొనుగోలు చేయడం, పెళ్లిళ్ల సీజన్ డిమాండ్ పెరగడం వంటి కారణాలు ధరలు ఎగబాకడానికి ప్రధాన కారణాలుగా మారాయి. భవిష్యత్తులో అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉంటాయన్నదానిపై బంగారం ధరల దిశ ఆధారపడి ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in